క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా పెడసనగంటి ట్రస్ట్ ద్వారా దేవరపల్లిలో సోమవారం 500 మంది దివ్యాంగులు, వృద్ధులు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు పెడసనగంటి సాయిబాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు తీగెల బలరామయ్య చేతుల మీదుగా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరు ట్రస్ట్ ఏర్పాటు చేసి గత 13 ఏళ్లుగా గ్రామంలోని దివ్యాంగులు, వృద్ధులు, పేదలకు దుస్తులను అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు స్పందన



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కొవ్వూరు: నటరాజ్ డాన్స్ అకాడమీ, యనాద సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, యువతులు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. వివిధ రకాల రంగులతో వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

గోదావరికి మహా నీరాజనం



కొవ్వూరు: పుష్య పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని గోష్పాద క్షేత్రంలో గోదావరి నదికి మహా నీరాజనం సమర్పించారు. ముందుగా క్షేత్రంలో ఉన్న గోదావరి మాతకు శాస్త్రయుక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరి నీరాజన సమితి అధ్యక్షులు కలిగొట్ల కృష్ణారావు దంపతుల చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోదావరి నదికి హారతులను సమర్పించారు.

రహదారి ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కొవ్వూరు: పట్టణంలో గామన్ ఇండియా బ్రిడ్జి టోల్‌గేట్ సమీపంలో 55వ నెంబర్ పోల్ వద్ద మోటారు సైకిల్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయనగరం జిల్లా గజపతినగరం గ్రామానికి చెందిన కొమిలి పైడిరాజు, గూడి సూర్యనారాయణలు తీవ్ర గాయాలపాలయ్యారు. విజయవాడ నుంచి విజయనగరం మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులు ఇరువుర్ని 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. పైడిరాజు తలకి బలమైన గాయం అయ్యింది. సూర్యనారాయణ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

మార్కెట్ విలువలపై అభ్యంతరాల స్వీకరణ

నిడదవోలు : ప్రభుత్వం పెంచనున్న మార్కెట్ విలువలపై కక్షిదారుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ ఎం.రాజబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న 46 గ్రామాలకు సంబంధించిన మార్కెట్ విలువలను స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కక్షిదారుల సౌకర్యార్థం ప్రదర్శించామన్నారు. మార్కెట్ విలువలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించుకోవడానికి ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చన్నారు.

మంత్రిని కలిసిన గడ్డం రవికుమార్



పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన అల్లు అర్జున్ ఫాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్

నిడదవోలు : ఆంధ్రాలో జరుగుతున్న సంక్రాంతి వేడుకలకు తెలంగాణ ప్రాంతం నుంచి జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామంలో సోమవారం మంత్రి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి వచ్చిన అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రవికుమార్ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్‌కు చెందిన సర్వబాబు యాదవ్ రాజేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

జాతర ఘనంగా నిర్వహించాలి

పెరవలి: మండలంలోని కాకరపర్రులో వేంచేసి యున్న కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాన్ని మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ప్రారంభించారు. గ్రామ దేవతలు గ్రామాన్ని చల్లగా చూడాలనే ఉద్దేశ్యంతో ఈ జాతర నిర్వహిస్తున్నారని అంతా కలిసి కట్టుగా అమ్మవారి జాతరను ఘనంగా జరిపించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో భోగి పండగ

- గ్రామాల్లో పెద్ద ఎత్తున భోగి మంటల ఏర్పాటు
- సందడి చేసిన యువకులు, చిన్నారులు



బ్రాహ్మణగూడెంలో భోగి మంట వద్ద యువకులు

చాగల్లు: పల్లెల్లో సంక్రాంతి వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడుతోంది. దూర ప్రాంతాల నుంచి బంధు మిత్రులు సంక్రాంతి వేడుకలకు గ్రామాలకు చేరుకోవడంతో పల్లెల్లో సంక్రాంతి శోభ ఉట్టిపడుతోంది. భోగి సందర్భంగా సోమవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి వేసిన భోగి మంటల వద్ద జనం గుమిగూడారు. దేవాలయాలు కళకళలాడాయి. చాగల్లు గ్రామదేవత పాటమ్మ అమ్మవారి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాటిమ్మపేటలోని అమ్మవారి గుడిని ప్రత్యేకంగా అలంకరించారు. బ్రాహ్మణగూడెంలోని నాగారమ్మ, ఊనగట్ల, చిక్కాలలో గ్రామ దేవత వేడుకలు నిర్వహించారు. చాగల్లు సద్గురు సాయి మందిరంలో సాయిబాబాకు భోగిపళ్లు వేసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామునే హరిదాసులు హరినామ కీర్తనలు చేసుకుంటూ కాళ్లకు గజ్జెలు కట్టుకుని వీధుల్లో తిరిగారు. హరిదాసులకు ఇళ్లల్లోని మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా కానుకలు సమర్పించారు. జంగమదేవరలు శివనామ స్మరణ చేస్తూ ఇంటింటా తిరిగి ప్రజలు ఇచ్చే భిక్షను స్వీకరించారు.

తాళ్లపూడి: సంక్రాంతి సంబరాలు పల్లెల్లో మొదలయ్యాయి. భోగి సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచి వీధుల్లో వేసిన భోగి మంటల వద్ద యువకులు గుమిగూడారు. హరిదాసులు హరినామ సంకీర్తనలు చేసుకుంటూ వీధుల్లో తిరిగారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా కానుకలు సమర్పించారు. దూర ప్రాంతాల నుంచి బంధుమిత్రులు గ్రామాలకు చేరుకోవడంతో పల్లెల్లో సంక్రాంతి శోభ ఏర్పడింది. తాళ్లపూడిలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు

నిడదవోలు: భోగి పండగను నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్‌లో శ్రీపూజ గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో భోగి వేడుకలను నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మిరెడ్డి స్వప్న, తోలేటి కోటేశ్వరరావు, ముప్పనబోయిన గంగారావు, దుళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ.. శంభోశంకర



దేవరపల్లి ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

దేవరపల్లి: భోగి పండుగ, శివ ముక్కోటి పర్వదినం సందర్భంగా సోమవారం దేవరపల్లి మండలంలోని పలు శైవక్షేత్రాలు హరహర..మహాదేవ అంటూ శివ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచి స్వామి వారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. ఉదయం 11.30 గంటల వరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవరపల్లిలోని ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ ఏర్పడింది. బారులు తీరి స్వామికి అభిషేకాలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు. మండలంలోని యర్నగూడెం, చిన్నాయగూడెం, గౌరీపట్నం, త్యాజంపూడి, కురుకూరు, లక్ష్మీపురం, బందపురం, యాదవోలు గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.

మెట్టలో జోరుగా కోడి పందేలు



కోడిపందేల వద్ద ఏర్పాటు చేసిన గుండాట బోర్డు



గోపాలపురంలో కోడి పందాల బరిలో ఆడుతున్న గుండాట

- గ్రామగ్రామాన వెలసిన బరులు
- యథేచ్ఛగా గుండాట
- 30 గ్రామాల్లో నిర్వహిస్తున్న వైనం

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా మెట్ట ప్రాంతంలోని గోపాలపురం నియోజకవర్గంలో కోడిపందేలు జోరుగా జరుగుతున్నాయి. సోమవారం గ్రామాల్లో కోడిపందేలను నిర్వాహకులు అట్టహాసంగా ప్రారంభించారు. పలు గ్రామాల్లో కూటమి నాయకులే పందాలను ప్రారంభించారు. రెండు రోజుల ముందు నుంచి పందేల నిర్వాహకులు అధికార పార్టీ నేతల అండదండలతో బరులు సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 30 గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసి, పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. మూడు రోజులు పందేలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. దేవరపల్లి మండలంలో సుమారు 10 గ్రామాల్లో బరులు నెలకొల్పారు. దేవరపల్లి, యాదవోలు, త్యాజంపూడి, బందపురం, యర్నగూడెం, ధుమంతునిగూడెం, సంగాయగూడెం, కురుకూరు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. పందేల వద్ద భారీగా నగదు చేతులు మారుతోంది. ఒకొక్క పందెం రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరుగుతున్నాయి. బరుల వద్ద గుండాట యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. యువత ఎక్కువగా గుండాట వైపు ఆకర్షితులవుతున్నారు.

యథేచ్ఛగా కోడి పందాలు, జూదం నిర్వహణ

గోపాలపురం: ప్రభుత్వాధికారులే నిబంధనలకు నీళ్లు వదిలి యథేచ్ఛగా కోడి పందాలు, గుండాట, పేకాట ఏర్పాట్లకు అనధికార అనుమతులు ఇవ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, కోడి పందాలకు అనుమతులు లేవని పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రకటించారు. వారు నివ్వెరపోయేలా కొందరు నిర్వాహకులు ఎక్కడికక్కడ కోడి పందాలు, పేకాట, గుండాటలు నిర్వహించారు. సోమవారం భోగి పండుగ ఉదయం నుండి గోపాలపురం మండలంలోని జగన్నాథపురం, సంజీవపురం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, దొండపూడి, గంగోలు, హుకుంపేట, చిట్యాల, వేళ్లచింతలగూడెం, గోపాలపురం, వాదాలకుంట గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగాయి. పందాలలో గుండాట, పేకాట నిర్వహించగా, మద్యం ఏరులైపారింది.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు : కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో పెంచిన విద్యుత్ చార్జీల బిల్లులను భోగి మంటలో వేసి దహనం చేశారు. ఎన్నికల ప్రచారంలో కూటమి అధికారంలోకి వస్తే ఎటువంటి చార్జీలు, ధరలు పెంచమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాటతప్పి ప్రజలపై భారం వెయ్యటం దారుణమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉండ్రాజవరం: ప్రజలను ఇబ్బందులకు గురి చేయటాన్నే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంబాబు అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలో మోర్త గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పెంచిన విద్యుత్ చార్జీల బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బరి తెగించారు

- జోరుగా కోడి పందేల నిర్వహణ
- నియోజకవర్గంలో 24 బరులు
- విచ్చలవిడిగా గుండాట స్థావరాలు
- చేతులు మారిన లక్షలాది రూపాయలు

నిడదవోలు : నియోజకవర్గంలో సంక్రాంతి పండగ ముసుగులో ఏటా నిర్వహించే కోడి పందేలు సోమవారం ప్రారంభమయ్యాయి. భోగి రోజున కోడి పందేలు జోరుగా సాగాయి. పోలీసులు అనధికార అనుమతులు ఇవ్వడంతో పందెంరాయుళ్లు బరితెగించి కోళ్లకు కత్తులు కట్టి బరుల్లో రక్తపుటేరులు పారించారు. ఎంతో మోజుతో పెంచుకున్న కోళ్లను బరిలో దించి పందెం రాయుళ్లు తమ సత్తా చాటుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 24 బరుల్లో కోడి పందేల బరులను ఏర్పాటు చేశారు. నిడదవోలు పట్టణంలో 04, నిడదవోలు రూరల్ మండలంలో 07, ఉండ్రాజవరం మండలంలో 07, పెరవలి మండలంలో 06 బరుల్లో జోరుగా కోడి పందాలు ప్రారంభమయ్యాయి. భోగి రోజున సుమారు రూ.2 కోట్ల మేర చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు. పందాల్లో ప్రధానంగా కాకి, డేగ, నెమలి, పరదా, పచ్చ కాకి, పిట్ట మారు, రసంగి, తీతువా మైయిలా, సింగాలి తదితర రకాల కోడు పుంజులను బరుల్లో దింపారు. బరుల్లో కోడి పందాలతో పాటు గుండాట, మూడు ముక్కలాట వంటి జూద క్రీడలను నిర్వహించారు. బరుల్లో అవసరమైన అన్ని రకాల తినుబండారాలను సైతం నిర్వహకులు ఏర్పాటు చేశారు. ప్రతి బరిలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యాన్ని ఏరులై పారించారు. ప్రధానంగా పట్టణ శివారున సుబ్బరాజుపేట–సింగవరం బరిలో భారీ ఎత్తున పందేలు జరిగాయి. ఇక్కడ నిర్వాహకులు ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి పందేలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఉభయ గోదావరి జిల్లాలలో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో పందెం రాయుళ్లు తరలి వచ్చారు. బరిలో ఎనిమిది గుండాట కేంద్రాలను ఏర్పాటు చేశారు. పందెం రాయుళ్లు, పందేలు తిలకించడానికి వచ్చిన వారికి అందుబాటులో మద్యం, బిర్యానీ సెంటర్‌లను సైతం ఏర్పాటు చేశారు.

అంతా బహిరంగంగానే..

నిడదవోలు రూరల్: ప్రజా ప్రతినిధుల అండ దండలతో పందెం నిర్వాహకులు బహిరంగంగానే పందేలు నిర్వహించారు. రాజకీయ పైరవీలతో ఈ సారి కూడా పోలీసులపై పందెం రాయుళ్లే గెలిచారు. బరులను పూలదండలతో అలంకరించారు. సంక్రాంతి సందర్భంగా తొలిరోజు సోమవారం నిడదవోలు మండలంలోని డి.ముప్పవరం, కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం గ్రామాల్లో ఉదయం నుంచి పందాలు జరుగుతున్నాయి. ఒక్కో పందేనికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బెట్టింగ్ చేస్తున్నారు.

కోడిపందేలు, గుండాట, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు కోడిపందేలు ప్రారంభంకాగానే బరులు వద్ద పత్తాలేకుండా పోయారు. అధికార పార్టీ ఒత్తిళ్లతో మౌనంగా ఉండిపోయి, పోలీస్ స్టేషన్లకే పరిమితమయ్యారు. పందేల నిర్వాహకులు పోలీసులకు భారీగా మామూళ్లు ముట్టజెప్పుకున్నారని విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఒక్కోబరికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు కోడిపందేల బరుల నిర్వాహకులు చెల్లించేందుకు అంగీకరించినట్లు ప్రచారం సాగుతోంది.

చాగల్లు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలో సోమవారం కోడిపందేలు నిర్వహించారు.మండలంలోని మీనానగరం, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, చిక్కాల, మల్లవరం, కలవలపల్లి గ్రామాల్లో కోడి పందేలను నిర్వహించారు. మొదటి రోజు సుమారు రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పందాలు జరిగినట్లు సమాచారం.

పెరవలి: పెరవలి మండలంలో సోమవారం జరిగిన పందేల్లో సుమారు రూ.30లక్షల నుంచి రూ.45 లక్షల వరకు చేతులు మారాయని నిర్వాహకులు చెబుతున్నారు. మండలంలోని ఖండవల్లి, పిట్టల వేమవరం, పెరవలి, అజ్జరం, ముక్కామల, అన్నవరప్పాడు గ్రామాల్లో కోడిపందాలు నువ్వా నేనా అన్నట్లుగా సాగాయి.

తాళ్లపూడి: సంక్రాంతి పండగ మూడు రోజులు కోడి పందేలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. పోలీసుల ఆంక్షలతో తాళ్లపూడి మండలంలోని ఆయా గ్రామాల్లో కోడి పందాలు ఉదయం నుంచి నిర్వహించారు. పందెం శిబిరాల వద్దకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు చేరడంతో సందడి నెలకొంది. మండలంలోని తాళ్లపూడి, గజ్జరం, పెద్దేవం, మలకపల్లి, వేగేశ్వరపురం, అన్నదేవరపేట, రావూరుపాడు తదితర గ్రామాల్లో 8 చోట్ల కోడి పందేలు నిర్వహించారు.



నిడదవోలు పట్టణ శివారు సుబ్బరాజుపేట-సింగవరం బరిలో గుండాట



కోడికి కత్తులు కడుతున్న పందెం రాయుళ్లు

వైభవంగా గోదా రంగనాథస్వామి కల్యాణం



దేవరపల్లిలో గోదారంగనాథస్వామి వారి కల్యాణ వేడుక నిర్వహిస్తున్న పురోహితులు

దేవరపల్లి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద సోమవారం రాత్రి గోదా రంగనాథ స్వామి వారి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గోదాదేవిని పెండ్లి కుమార్తెగా, రంగనాథ స్వామిని పెండ్లి కుమారుడిగా అలంకరించి, పురోహితులు కల్యాణ వేదిక పైకి తోడ్కొని వచ్చారు. అనంతరం కల్యాణ క్రతువు నిర్వహించారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకూ కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భోగి పండగ నాడే గోదా రంగనాథుల కల్యాణం జరపటం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. ధనుర్మాస వ్రతంలో భాగంగా అమ్మ అనుగ్రహించిన తిరుప్పావైని అనుసంధానించి, చివరిగా కల్యాణంతో ముగించి గోదారంగనాథుల కృపకు పాత్రులు కావడం అత్యంత అవశ్యమని చెప్పారు. కల్యాణానంతరం భక్తులకు కల్యాణ అక్షతలు, ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భోగి సందర్భంగా గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ, సర్పంచ్ పంత బాల సుందరి, కూటమి నాయకుల ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి పండగను ఘనంగా ప్రారంభించారు. అనంతరం గోదాదేవి కల్యాణంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

గోపాలపురం: వేళ్లచింతలగూడెం కోదండ రామాలయం వద్ద సోమవారం గోదాదేవి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిని 11 మంది వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా సంక్రాంతి సంబరాల కమిటీ, గ్రామస్తుల సారథ్యాన గోదాదేవి కల్యాణం ఘనంగా జరిగింది.

బాలదుర్గమ్మ సన్నిధిలో తులాభారాలు



మహిళను బెల్లంతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: మండలంలో కొలువైన బాలదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో సోమవారం మూడు తులాభారాలు వేశారు. ఐరగవరం మండలం తూర్పు విప్పర్రుకు చెందిన రావూరి శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు బాబును అమ్మవారి సన్నిధిలో పటిక బెల్లం, చిల్లర నాణేలతో వేర్వేరుగా తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. రావూరి వెంకటలక్ష్మిని కుటుంబ సభ్యులు బెల్లంతో తులాభారం వేసి మొక్కు చెల్లించారు. తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కోశాధికారి కామిశెట్టి దుర్గారావు మాట్లాడుతూ, 2012 నుంచి అమ్మవారి సన్నిధిలో భక్తులు తులాభారాలతో మొక్కులు తీర్చుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 687 తులాభారాలు జరిగినట్టు చెప్పారు.

సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు



కాపవరంలో భోగి మంటలు వెలిగిస్తున్న ఏఐసీసీ సభ్యురాలు అమర్ జహీ బేగ్, ఫసీ ఉల్లా బేగ్ దంపతులు

నిడదవోలు రూరల్: భోగ భాగ్యాలను అందించే భోగి పండగను నిడదవోలు మండలంలోని ప్రజలంతా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఇళ్ల ముందు, వీధుల్లో పెద్ద పెద్ద దుంగలు, కలపతో భోగి మంటలు వేశారు. చిన్నారులు భోగిమంటల్లో పిడకలు వేసి ప్రదక్షిణలు చేశారు. చిన్నారులపై భోగిపండ్లు పోశారు. దీంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గ్రామాల్లోని ఇళ్ల రంగవల్లులతో నిండిపోయాయి. మునిపల్లిలో శ్రీలక్ష్మీనారాయణస్వామి, తాడిమళ్ల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాలస్వామి దేవస్థానంలో నగర సంకీర్తన, స్వామివారికి విశేష అర్చనలు ఘనంగా నిర్వహించారు.

భోగి వేడుకలు నిర్వహించిన ముస్లింలు

కొవ్వూరు: కుల,మతాలకు అతీతంగా కాపవరం గ్రామంలో సోమవారం భోగి పండగ నిర్వహించారు. ఏఐసీసీ మెంబర్ అమర్ జహీబేగ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఫసీ ఉల్లా బేగ్ దంపతుల ఆధ్వర్యంలో భోగి మంటలు వెలిగించారు. అమర్ జహీబేగ్ భోగి మంటల్లో ఆవుపేడతో తయారు చేసిన పిడకలను వేశారు. హిందూ సోదర సోదరీమణులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

జ్ఞాన సరస్వతీ ఆలయంలో చండీహోమం

కొవ్వూరు: పట్టణంలోని గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తి శ్రద్ధలతో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. పండితులు నెమ్మలూరి సత్య సూర్య సుబ్రహ్మణ్య భగవాన్, నెమ్మలూరి నాగ ప్రకాష్, వాడ్రేవు సాయి కామరాజు, పమ్మి రవిబాబు, చామర్తి విశ్వనాథరావు, వాడ్రేవు సూర్య సుబ్రహ్మణ్యం, తెన్నేటి సూర్యనారాయణ వైవీవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు.

గోదారోళ్లా.. మజానా..

116 వంటకాలతో అల్లుడికి విందు భోజనం



గోపాలపురంలో 116 వంటకాలతో అల్లుడికి ఏర్పాటు చేసిన విందు భోజనం

గోపాలపురం: గోదారోళ్లా.. మజానా.. అన్నట్లు తెలంగాణ అల్లుడికి 116 వంటకాలతో రుచి చూపించారు అత్తింటివారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన జగన్ మోహన్‌రావు, సుమిత్ర దంపతుల కుమార్తె లక్ష్మీశ్వేతకు నాలుగు నెలల కిందట హైదరాబాద్‌కు చెందిన బాలాజీ పవన్ సాయిరామ్‌తో వివాహం జరిగింది. వివాహం జరిగిన తరువాత వచ్చిన పెద్ద పండగ కావడంతో సంక్రాంతికి సంప్రదాయబద్ధంగా అల్లుడిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోదావరి సంప్రదాయాలు పాటిస్తూ కొత్త అల్లుడికి ఎంతో మురిపెంగా 116 వంటకాలతో భారీ విందుభోజనం ఏర్పాటు చేశారు. రకరకాల పిండి వంటలు రుచి చూపించారు. జగన్‌మోహన్‌రావు తల్లిదండ్రులు సుబ్బలక్ష్మి, వీరభద్రరావు తదితరులతో కలసి కుటుంబ సభ్యులు సందడి చేశారు.

గజవాహనంపై శ్రీనివాసుడు

పెరవలి: ధనుర్మాసం, భోగి సందర్భంగా అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. సోమవారం భోగి కావటంతో భక్తులు తరలి రావటంతో ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. సాయంత్రం గజవాహనంపై ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.

కోడి పందేలు ఆడుతున్న 12 మంది అరెస్టు

ఉండ్రాజవరం: మండలంలో కోడి పందేలు ఆడుతున్న వారిపై సోమవారం ఉండ్రాజవరం ఎస్సై గుబ్బల శ్రీనివాస్, సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడిలో 4 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీనివాసు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,300 నగదు, 4 కత్తులు, 4 కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.